ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం, 26 జూన్ 2024 www.prajaaswaramdaily.com 2PM




# ఓం బిర్లా.. రెండోసారి

## 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నిక

**ప్రతిపాదించిన ప్రధాని నరేంద్ర మోదీ**

**మూజువాణీ ఓటుతో గెలుపు**

**48 ఏళ్ల అనంతరం విపక్షాల పోటీ**

**ఇండి కూటమి తరపున కే సురేష్**

దిల్లీ, జూన్ 26 (ప్రజాస్వరం): లోక్ సభ స్పీకర్ గా భాజపా ఎంపీ ఓం బిర్లా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థిపై ఆయన విజయం సాధించారు. 48ఏళ్ల తర్వాత స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. సభాపతి పదవిపై అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. బుధవారం లోక్ సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. సభాపతిగా ఓం బిర్లా పేరును ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించారు. రాజ్ నాథ్ సింగ్ తో పలువురు ఎన్డీయే ఎంపీలు బలపరిచారు. ఇండి కూటమి తరపున కె.సురేశ్ పేరును శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానం తీసుకొచ్చారు. దీన్ని పలువురు విపక్ష ఎంపీలు బలపర్చారు. అనంతరం మూజువాణీ విధానంలో ఓటింగ్ చేపట్టారు. ఇందులో ఓం బిర్లా విజేతగా నిలిచినట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెంట రాగా.. ఓం బిర్లా సభాపతి పీఠంపై ఆసీనులయ్యారు. ఆయనకు సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు.

### వరుసగా రెండుసార్లు

స్పీకర్ పదవిని వరుసగా రెండుసార్లు చేపట్టిన ఐదో వ్యక్తి ఓం బిర్లా. ఆయన



రాజస్థాన్ లోని కోటా నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. 2014–19లో ఆయన లోక్ సభలో 86 శాతం హాజరును నమోదు చేసుకున్నారు. 671 ప్రశ్నలడిగారు. 2019లో అనూహ్యంగా స్పీకర్ అయ్యారు.

### మీ చిరునవ్వుతో సభలో ఆనందం: మోదీ

ఈ సందర్భంగా ఓం బిర్లాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు స్పీకర్ గా ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'వరుసగా రెండోసారి స్పీకర్ గా ఎన్నికైన మీకు లోక్ సభ సభ్యులందరి తరపున అభినందనలు. మీరు ఎన్నికలో గెలిచి చరిత్ర సృష్టించారు. సభను సరైన దిశలో నడపడంలో స్పీకర్ ది కీలక పాత్ర. లోక్ సభ చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహించారు. గత ఐదేళ్లలో స్పీకర్ గా మీ పదవీకాలంలో సభ 97 శాతం పనిచేసింది. పాతికేళ్లలోనే ఇది అత్యధికం కావడం విశేషం. కొవిడ్ సమయంలోనూ సభ సజావుగా సాగేలా చూశారు. సభా మర్యాదను కాపాడేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. అనేక కీలక బిల్లులను ఆమోదించారు. వచ్చే ఐదేళ్లూ సభ్యులందరికీ మార్గదర్శనం చేస్తారని విశ్వాసం ఉంది. కొత్త ఎంపీలకు మీరు స్ఫూర్తిగా నిలుస్తారు. మీ మధురమైన చిరునవ్వుతో సభ ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుంది' అని మోదీ ప్రశంసలు కురిపించారు.

### విపక్షాల గళాన్ని అనుమతించాలి: రాహుల్

అనంతరం లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. 'ఇండియా కూటమి తరపున ఓం బిర్లాకు శుభాకాంక్షలు. ఈ సభ భారతదేశ జనవాణిని వినిపించాలి. ప్రభుత్వానికి రాజకీయంగా బలం ఉండొచ్చు.. కానీ విపక్షాలు ప్రజావాణికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సభ సజావుగా నడపడంలో ప్రతిపక్షం మీకు పూర్తి సహకారం అందిస్తుంది. ప్రజావాణిని బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశమిస్తారని ఆశిస్తున్నా. విపక్షం గొంతు నొక్కడం ద్వారా సభను నడపటం అప్రజాస్వామికం అవుతుంది. మాకు మాట్లాడే అవకాశం ఇస్తారని విశ్వాసంగా ఉన్నాం' అని రాహుల్ అన్నారు. పలువురు విపక్ష నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. స్పీకర్ గా ఓం బిర్లా సభలో పక్షపాతం లేకుండా వ్యవహరించాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు.

# పీసీసీకి కొత్త ఛీఫ్!

## కొత్త అధ్యక్షుడి ఎంపికపై అధిష్ఠానం కసరత్తు

### రేపటితో ముగియనున్న ప్రస్తుత అధ్యక్షుడి పదవీకాలం



- పరిశీలనలో అర డజను పేర్లు
- కొత్త సారథిగా లేడీ ఫైర్ బ్రాండ్!
- సోషల్ మీడియా, పొలిటికల్ సర్కిల్లో వైరల్ ..

హైదరాబాద్, జూన్ 25 (ప్రజాస్వరం) : తెలంగాణలో కొత్త పీసీసీ ఛీఫ్ ఎంపికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వ బాధ్యతలను, పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ బాధ్యతలను రెండింటినీ నిర్వహిస్తున్నారు. ఈనెల 27తో పీసీసీ అధ్యక్షుడి పదవీకాలం ముగియనుంది. దీంతో కొత్తగా ఈ పోస్టులో ఎవరిని నియమిస్తారనే ఆసక్తి సర్వత్ర నెలకొంది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. మంత్రివర్గ విస్తరణతోపాటు పీసీసీ అధ్యక్షుడి ఎంపికపైనా ఆయన ఢిల్లీ పెద్దలతో చర్చిస్తున్నారు. మరోపక్క పీసీసీ పీఠం ఆశిస్తున్న వారితోపాటు, కాబినెట్‌లో బెర్త్ కోసం ప్రయత్నిస్తున్న రాష్ట్ర ముఖ్య నేతలంతా ఢిల్లీలోనే మకాంవేశారు.

### పోటీలో ఉన్నది వీళ్లే..

పీసీసీ రేసులో ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్క పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సీఎం రేవంత్‌కు అత్యంత సన్నిహితురాలిగా, సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకకు విధేయురాలిగా సీతక్కకు పేరుంది. ముఖ్యంగా ఆదివాసీ గిరిజన వర్గానికి చెందిన ఫైర్‌బ్రాండ్ మహిళా నేతగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. సీతక్కతోపాటు పీసీసీ రేసులో బీసీ వర్గానికి చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఎస్టీ నుంచి మానుకోట ఎంపీ బలరాంనాయక్, ఎస్సీల నుంచి సీనియర్ నేతలు సంపత్ కుమార్, అద్దంకి దయాకర్ తదితర పేర్లు వినిపిస్తున్నాయి. ఒకవేళ రెడ్డి సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇస్తే.. తనకు అవకాశం ఇవ్వాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హైకమాండ్‌ను కోరుతున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా తనకు పీసీసీ పదవి లేదా మంత్రి పదవి ఇవ్వాలని ఢిల్లీ పెద్దలను కోరుతున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. తన అన్న మంత్రి వెంకట్‌రెడ్డితో కలిసి రాజధానిలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో అదృష్టం ఎవరిని వరిస్తుందో మరికొద్ది రోజుల్లోనే తేలనుంది.

### ఇంజనీరింగ్ కౌన్సిల్ జూలై 4 నుంచి..

హైదరాబాద్, జూన్ 26 (ప్రజాస్వరం): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఈ కోర్సుల్లో ప్రవేశాలకు రేపట్నుంచి జరగవల్సిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. జూన్ 27 నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా.. షెడ్యూల్ లో మార్పులు చోటు చేసుకున్నట్లు ఉన్నత విద్యా మండలి ప్రకటించింది.

అది వాయిదా పడింది. ఈ సందర్భంగా కొత్త షెడ్యూల్ ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం తొలివిడత ప్రవేశాల ప్రక్రియ జులై 4 నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఏడాది జరిగిన టీఎస్ ఈఏపీసెట్ పరీక్షకు ఇంజనీరింగ్ విభాగంలో 2,40,618 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 91,633 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షకు హాజ రైన వారిలో అగ్రికల్చర్, ఫార్మసీలో 89 శాతం, ఇంజినీరింగ్ విభాగంలో 74.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మరో రెండు రోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందనంగా ఇంతలో కొన్ని కారణాల రిత్య కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.

**కొత్త షెడ్యూల్ ఇదే..**

–జులై 4 నుంచి ఇంజినీరింగ్ తొలివిడత రిజిస్ట్రేషన్లు ప్రారంభం
–జులై 6 నుంచి 13 వరకు తొలి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్
–జులై 8 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం
–జులై 19న తొలివిడత సీట్ల కేటాయింపు
–జులై 26 నుంచి రెండో విడత కౌన్సిలింగ్లు
–జులై 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్లు
–జులై 27, 28 తేదీల్లో రెండో విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం
–జులై 31న రెండో విడత సీట్ల కేటాయింపు
–ఆగస్టు 8 నుంచి మూడో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ
–ఆగస్టు 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్ఆగస్టు 9,10 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం
–ఆగస్టు 13న 3వ విడత సీట్ల కేటాయింపు
–ఆగస్టు 21 నుంచి కన్వినర్ కోట ఇంటర్నల్ స్లైడింగ్ కి అవకాశం

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి దిల్లీ నుంచి పిలుపు



హైదరాబాద్, జూన్ 26 (ప్రజాస్వరం): కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఆ పార్టీ నేతల బుజ్జగింపులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు ఆయనతో మాట్లాడారు. తాజగా దిల్లీకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ నుంచి పిలుపు వచ్చింది. ఈ విషయంపై ఆమె జీవన్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ఆయన దిల్లీ బయలుదేరనున్నారు. ఇటీవల భారాస ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ లో చేరడంతో జీవన్ రెడ్డి మనస్తాపానికి గురయ్యారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని, కాంగ్రెస్ పార్టీలో మాత్రం కొనసాగుతానని ప్రకటించారు. మరోవైపు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే దిల్లీ చేరుకున్నారు.

### యువకుడి దారుణ హత్య

హైదరాబాద్, జూన్ 26 (ప్రజాస్వరం): సికింద్రాబాద్.. బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉస్మాన్ అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పాటిగడ్డ పుట్‌పాత్ పై అర్ధరాత్రి సమయంలో బేగంపేట్ పాత పాటిగడ్డకు చెందిన ఫిరోజ్, ఐజాజ్, సాహిల్, రెహాన్ విచక్షణ రహితంగా కత్తులతో దాడికి పాల్పడి గొంతుకోసి హత్య చేశారు. ప్రేమ వ్యవహారమే హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఐజాజ్ మరదలు నేహా ను ఉస్మాన్ ప్రేమిస్తున్నాడనే కోపంతో స్నేహితులతో కలిసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న బేగంపేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీ లో ఉన్నారని తెలుస్తున్నది.



### పాత బస్తీలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్, జూన్ 26 (ప్రజాస్వరం): హైదరాబాద్ నగరంలో దుకాణాలు రాత్రి 10.30 గంటలకు మూసి వేయాలని నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చంపాపేట్,సంతోష్ నగర్, చాదర్ ఘాట్, మలక్ పేట, సైదాబాద్ పాతబస్తీ పరిసర ప్రాంతాల్లో సైదాబాద్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సమయం ముగిసిన తెరిచి ఉన్న హోటళ్ళు, పాన్ షాప్ లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, దుకాణాలు, షో రూమ్ లను సైదాబాద్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర దగ్గరుండి మూసి వేయించడం జరిగింది. అనుమానితులను తనిఖీ లు చేపట్టడం జరిగింది. రాత్రి సమయాలలో రోడ్లపై తిరుగుతున్న యువకులకు పోలిసులు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది. అనవసరంగా తిరిగితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

### ఏసీబీ వలలో ఎస్ఐ

కల్వకుర్తి, జూన్ 26 (ప్రజాస్వరం): వెల్దండ పోలీస్ స్టేషన్లో ఏసీబీదాడులలోఎస్ఐ రవికుమార్ దొరికిపోయాడు. కల్వకుర్తికి చెందిన ఓ వ్యక్తి వద్ద మందు గుండు సామాగ్రి దొరికిన నేపథ్యంలో రూ.50వేలు ఇస్తే కేసునమోదు చేయనని ఎస్ఐ చెప్పారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించి మధ్యవర్తి కల్వకుర్తికి చెందిన డ్రైవర్ విక్రమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో దాడులు చేయగా పట్టుబడ్డాడు.

### దిల్లీ లిక్కర్ స్కాంలో సీబీఐ కస్టడీకి సీఎం కేజ్రీవాల్



దిల్లీ, జూన్ 26 (ప్రజాస్వరం): దిల్లీ లిక్కర్ స్కాం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు కేంద్ర దర్యాప్తు బృందానికి కోర్టు బుధవారం అనుమతించింది. న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఆదేశాలు జారీ చేసిన వెంటనే సీబీఐ అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తిహాడ్ జైలు నుంచి కేజ్రీవాల్‌ను ఉదయం కోర్టు ముందు హాజరుపర్చారు. ఆయనను కస్టడీకి కోరుతూ కోర్టుకు సీబీఐ దరఖాస్తు చేసుకుంది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# ఇక కేరళం..

## రాష్ట్రం పేరు మర్చాలని అసెంబ్లీలో తీర్మానం

### కేంద్రానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం విన్నపం




తిరువనంతపురం, జూన్ 26 (ప్రజాస్వరం): కేరళ పేరును కేరళంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అన్ని పార్టీలు మద్దతు తెలపడంతో తీర్మానం శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. అయితే సీఎం పినరయి ప్రవేశపెట్టిన తీర్మానానికి విపక్షాలు కొన్ని సవరణలు ప్రతిపాదించాయి. గతేడాది ఆగస్టు 9వ తేదీన కూడా కేరళ పేరును కేరళంగా మార్చాలని కోరుతూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. రాజ్యాంగంలో ఈ విషయాన్ని మొదటి షెడ్యూల్, ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరింది. తొలి తీర్మానం పరిశీలన తర్వాత, కొన్ని మార్పులు చేయాలని కోరింది కేంద్ర ప్రభుత్వం. దీంతో మార్పులు చేసిన తర్వాత తాజాగా మరోసారి రాజ్యాంగంలోని ఎనిమిదో జాబితాలో పేరు మార్పు విషయాన్ని చేర్చాలనే తీర్మానాన్ని పంపింది కేరళ ప్రభుత్వం.కేరళ పేరును అన్ని భాషల్లోనూ కేరళంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని పినరయి సర్కార్ కోరింది. రాష్ట్రంపేరును పూర్వం నుంచే మలయాళం అని పిలిచేవారని, మలయాళం మాట్లాడే ప్రజల కోసం ఐక్య కేరళ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ పూర్వ కాలం నుండే ఉందని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. కేరళల సాంస్కృతిక నేపథ్యం, చరిత్రను దృష్టిలో ఉంచుకుని కేరళంగా పేరు మార్చాలనే డిమాండ్ అన్నివర్గాల ప్రజలనుంచి ఉందన్నారు. మరోవైపు దేశంలో ఏదైనా రాష్ట్రంపేరును మార్చాలంటే రాజ్యాంబద్ధంగా కేంద్రం ఆమోదం పొందాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోనే ఆ రాష్ట్రం పేరును మార్చాల్సి ఉంటుంది. రాష్ట్రం పేరు మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వ పరిధికి సంబంధించిన అంశం. మరి ఈసారైనా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కేరళ మార్పుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అన్నది ఆసక్తిగా మారింది.

### హైదరాబాద్లో మరోసారి ఈడీ దాడులు

హైదరాబాద్, జూన్ 26 (ప్రజాస్వరం): హైదరాబాద్ లో ఈడీ దాడులు మరోసారి కలకలం రేపాయి. తాజాగా హోం చారిటీ గ్రూప్ పై 11 చోట్ల ఈడీ సోదాలు బుధవారం నిర్వహించింది. విదేశాల నుంచి రూ.300 కోట్లవిరాళాలు తీసుకుని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ సోదాలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలోనూ ఈడీ సోదాలు జరిగాయి.

### 10 టన్నుల చేపల మృతి

హైదరాబాద్, జూన్ 26 (ప్రజాస్వరం): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం చిట్కుల్ పెద్ద చెరువులో పెద్ద ఎత్తున చేపల మృతి చెందాయి. రసాయన వ్యర్థ పదార్థాలు చెరువులో కలవడంతోనే చేపలు మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. సుమారు 10టన్నులకు పైగా చేపలు మృతి చెందడంతో కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు